క్లుప్తంగా

శోభాయాత్రను జయప్రదం చేయండి

కొత్తూరు: హనుమాన్ జయంతి సందర్భంగా మే 1న పట్టణంలో నిర్వహించనున్న స్వామివారి శోభాయాత్రను జయప్రదం చేయాలని ఏబీవీపీ, బీజేపీ నాయకులు కోరారు. ఇందులో భాగంగా మంగళవారం ఆలయ ఆవరణలో సన్నాహక సమావేశం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. శోభాయాత్రలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శివకుమార్‌చారి, నరేశ్‌చారి, సందీప్‌సింగ్, మురళి, హర్ష, కిశోర్, మహేశ్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

నేడు పామాయిల్ సాగుపై అవగాహన

కేశంపేట: మండల పరిధిలోని లేమామిడి గ్రామంలో ఉన్న రైతు వేదికలో ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన సమావేశం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీహెచ్‌ఎస్‌ఓ నీరజగాంధీ, ఏడీహెచ్ సంజయ్‌కుమార్, షాద్‌నగర్ ఏడీఏ రాజారత్నం, ఆయిల్‌పామ్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ రాంమోహన్‌రావు, హార్టికల్చర్ అధికారి ఉషారాణి, మండల వ్యవసాయ అధికారి శిరీషలు పాల్గొంటారన్నారు. అధిక ఆదాయం ఎక్కువ కాలం ఇచ్చే ఆయిల్‌పామ్‌పై వారు వివరిస్తారని పేర్కొన్నారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

పీసీసీ ప్రెసిడెంట్‌గా దళితుడిని నియమించాలి

కొందుర్గు: పీసీసీ ప్రెసిడెంట్‌గా దళితుడిని నియమించాలని కాంగ్రెస్ నాయకుడు వజ్రలింగం మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో ఎందరో దళిత నాయకులు కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తూ పార్టీ అభివృద్ధి కోసం కృషి చేశారని, అలాంటి నాయకులకు ఓ సారి పార్టీ అధ్యక్ష పీఠం ఇవ్వాలని కోరారు.

నిరుపేదలకు వరం సీఎంఆర్‌ఎఫ్

కడ్తాల్: ప్రజారోగ్య పరిరక్షణే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీటీసీల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రానికి చెందిన కేశని జంగయ్య అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. స్థానిక నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి బాధితుడికి మెరుగైన వైద్యం అందించేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.2.10 లక్షల ఎల్‌ఓసీ చెక్కుమంజూరు చేయించారు. ఆ చెక్కును శ్రీనివాస్‌రెడ్డి బాధితుడికి మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ వెంకటేశ్, నాయకులు అశోక్ ఉన్నారు.

మేమున్నామని..



బాధిత కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న స్నేహితులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆపదలో ఉన్న తోటి స్నేహితుడికి వారంతా మేమున్నామని అండగా నిలిచారు. యాచారం మండలం గడ్డమల్లయ్యగూడకు చెందిన యాదగిరి ఇటీవల గున్‌గల్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. విషయం తెలుసుకున్న తోటి స్నేహితులు, గ్రామస్తులు అతడి కుటుంబానికి అండగా నిలిచారు. రూ.2,46,700 పోగుచేసి అతడి కుటుంబానికి అందజేశారు. భవిష్యత్‌లో యాదగిరి కుటుంబానికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.

కార్యాలయం తరలించడంపై నిరసన



నిరసన తెలుపుతున్న నాయకులు

బడంగ్‌పేట్: తహసీల్దార్ కార్యాలయం బాలాపూర్ నుంచి బడంగ్‌పేటకు తరలించడాన్ని అఖిలపక్షం నాయకులు ఖండించారు. మంగళవారం బాలాపూర్‌లోని పాత తహసీల్దార్ కార్యాలయం వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు బొర్ర రవి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలాపూర్ తహసీల్దార్ కార్యాలయం తరలింపునకు నిరసనగా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. బాలాపూర్ పేరుతో మంజూరైన బాలాపూర్ అర్బన్ హెల్త్ సెంటర్‌ను మీర్‌పేటకు తరలిస్తే స్థానిక నాయకులు పట్టించుకోలేదని, అదేవిధంగా పోలీస్ స్టేషన్‌ను మల్లాపూర్‌కు తరలిస్తే ఇక్కడి నాయకులు పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా నాయకులు పట్టించుకొని తహసీల్దార్ కార్యాలయాన్ని బాలాపూర్‌కు తిరిగివచ్చేలా చూడాలని కోరారు.



దూసకల్ గ్రామ సమీపంలో ప్రమాదకరంగా ఉన్న మలుపు



కమ్మదనం గ్రామ శివారులో ఉన్న మలుపు

మలుపులు.. ప్రమాద ఘంటికలు

మలుపుల వద్ద కానరాని సూచిక, హెచ్చరిక బోర్డులు

- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు
- వాహనదారులకు తప్పని తిప్పలు

షాద్‌నగర్: పలు గ్రామాల్లో మలుపులు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. మలుపుల వద్ద తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మలుపు ఉన్న ప్రదేశాల్లో ఎటువంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలకు గురవుతున్నామని పేర్కొంటున్నారు. మలుపుల వద్ద రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన ముళ్లచెట్లను తొలగించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి మలుపుల వద్ద ముళ్ల చెట్లను తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సూచికబోర్డులు లేక ప్రమాదాలు..

ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని దూసకల్, కమ్మదనం గ్రామాల సమీపంలోని మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. దీంతో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. షాద్‌నగర్ నుంచి దర్గాకు వెళ్లే దారిలోని దూసకల్ గ్రామ సమీపంలో గల మలుపులు ప్రమాదకరంగా మారాయి. అదేవిధంగా షాద్‌నగర్ నుంచి కేశంపేట దారిలో కమ్మదనం గ్రామ సమీపంలో మలుపులు అనునిత్యం ప్రమాద ఘంటికలను సూచిస్తున్నాయి. ఈ రహదారుల మీదుగా ప్రతిరోజు వందల సంఖ్యలో ప్రయాణికులు వివిధ గ్రామాలకు ప్రయాణిస్తుంటారు. రోడ్డు నిర్మాణ సమయంలో ఆర్అండ్‌బీ అధికారులు మలుపుల వద్ద ఎలాంటి సూచిక బోర్డులను ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. సూచికబోర్డులు లేకపోవడం, మలుపుల వద్ద ఏపుగా పెరిగిన ముళ్లచెట్లను తొలగించకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతూ క్షతగాత్రులు అవుతున్నారు. మలుపుల వద్ద సూచికబోర్డులను ఏర్పాటు చేయాలని ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఏపుగా పెరిగిన చెట్లను తొలగించి సూచికబోర్డులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



రోడ్డు మలుపుల వద్ద చాలామంది వాహనదారులు కిందపడి ప్రమాదాల బారిన పడుతున్నారు. వాహనదారులకు కనిపించే విధంగా అధికారులు సూచికబోర్డులు ఏర్పాటు చేయాలి.
– ప్రభు, షాద్‌నగర్

ముళ్ల చెట్లను తొలగించాలి



రోడ్డు మలుపుల వద్ద ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలి. మలుపుల వద్ద రోడ్డుకు ఇరువైపులా ఏపుగా పెరిగిన ముళ్ల చెట్లను తొలగించి, సూచిక బోర్డులను ఏర్పాటు చేయాలి. – రాములు, షాద్‌నగర్

రాజీవ్‌గాంధీ సేవలు మరువలేనివి



షాద్‌నగర్‌లో రాజీవ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు



మొయినాబాద్‌రూరల్: హిమాయత్‌నగర్‌లో..

షాద్‌నగర్: దేశ ప్రధానిగా రాజీవ్‌గాంధీ చేసిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. రాజీవ్‌గాంధీ వర్ధంతిని మంగళవారం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నేతలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. అనంతరం బాలికల ఉన్నత పాఠశాల ఎదుట ఉన్న రాజీవ్ గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం రాజీవ్‌గాంధీ ఎన్నో అభివృద్ధి సంక్షేమ పథకాలు చేపట్టారన్నారు. భారతదేశాన్ని ప్రపంచ దేశాలతో సైన్స్ అండ్ టెక్నాలజీ దిశగా పోటీపడే విధంగా అభివృద్ధి చేశారన్నారు. రాజీవ్‌గాంధీ దేశానికి చేసిన సేవలు మరువలేనవని కొనియాడారు. అదే విధంగా మహానేత కుటుంబం దేశ సంక్షేమం, అభివృద్ధికి పాటు పడుతుందన్నారు. రాజీవ్‌గాంధీ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు బాబర్‌ఖాన్, ఖాజా ఇద్రీస్, వెంకట్రామిరెడ్డి, కొంకళ్ళ చెన్నయ్య, శ్రీకాంత్‌రెడ్డి, జమృద్‌ఖాన్, పురుషోత్తంరెడ్డి, కృష్ణవేణి, ముబారక్, జాంగారి రవి, జంగయ్య, అందె శ్రీకాంత్, గంగనమోని సత్తయ్య, జగదీశ్, వీరేశం, శ్రీధర్‌రెడ్డి, సురేశ్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని హిమాయత్‌నగర్ చౌరస్తాలో రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీశ్, టీపీసీసీ కార్యవర్గ సభ్యుడు షాబాద్ దర్శన్ పాల్గొని నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, మత్స్యకారుల జిల్లా చైర్మన్ మహేందర్‌ముదిరాజ్, సంజీవరెడ్డి, రవీందర్‌రెడ్డి, నిరంజన్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, రాంరెడ్డి, సత్యనారాయణ, ఎన్కెపల్లి భిక్షపతి, దారెడ్డి కృష్టారెడ్డి, బాలకృష్టారెడ్డి, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాకారంలో ఇంటి పక్కనే ఇనుప స్తంభం



రోడ్డు మధ్యలో ఇనుప స్తంభం

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

- భయాందోళనకు గురవుతున్న ప్రజలు

మొయినాబాద్‌రూరల్: మండల పరిధిలోని బాకారం గ్రామంలో గతంలో వేసిన విద్యుత్ ఇనుప స్తంభాలు తుప్పుపట్టి ఇళ్ల మధ్య, ఇళ్లకు ఆనుకొని ప్రమాదకరంగా మారాయి. ఎప్పుడు ఏమి జరుగుతుందో అని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ విషయాన్ని గత 20 ఏళ్ల నుంచి మండల సర్వసభ్య సమావేశంతో పాటు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆ గ్రామస్తులు వాపోతున్నారు. బాకారం గ్రామంలో 50 ఏళ్ల క్రితం విద్యుత్ సరఫరా కోసం అధికారులు ఇనుప స్తంభాలను ఏర్పాటు చేశారు. ఈ స్తంభాలపై 11కేవీ విద్యుత్ సరఫరా జరుగుతోంది. వర్షాకాలంలో ఈ విద్యుత్‌స్తంభాలకు వివిధ వైర్లతో ఎర్తింగ్‌తో కరెంటు షాక్ వస్తోంది. ఇప్పటికే ఎన్నో మూగజీవాలు మరణించాయని ఆ గ్రామస్తులు పేర్కొంటున్నారు. సంవత్సరం క్రితం గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో విద్యుత్ సమస్య నివారించేందుకు మెయింటెనెన్స్ పనుల కోసం మండలానికి కోటి రూపాయల నిధులు కేటాయించింది. అయినా బాకారం గ్రామంలో 2–3 స్తంభాలు తొలగించి అధికారులు చేతులు దులుపుకున్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గ్రామంలో ప్రస్తుతం దాదాపు 25కుపైగానే ఇనుప స్తంభాలు ఉన్నాయని వర్షాకాలంలో ప్రమాదకరంగా మారుతాయని ఆ గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా విద్యుత్ ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదకరంగా మారిన ఈ ఇనుప స్తంభాలను తొలగించి సిమెంట్ స్తంభాలను ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయంపై విద్యుత్ ఏఈ ఆమునాయక్‌ను వివరణ కోరగా.. బాకారం గ్రామంలో కొన్ని ఇనుప స్తంభాలను తొలగించామని, 11కేవీకి సంబంధించిన ఇనుప స్తంభాలు ఇంకా ఉన్నాయి. పైఅధికారుల నుంచి తొలగించాలని అనుమతి వచ్చింది. గ్రామంలో స్తంభాలు తొలగించడానికి కావాల్సిన డీడీని చెల్లించాలి. వెంటనే ఈ ఇనుప స్తంభాలు తొలగించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

షాద్‌నగర్: పట్టణంలోని 220 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ట్రాన్స్‌కో పట్టణ ఏఈ వినోద్ తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని అన్ని కాలనీలతో పాటుగా, నాగులపల్లి, రాసుమాళ్లగూడ, నందిగామ మండలం మామిడిపల్లి, వీర్లపల్లి, మొత్కులగూడ, మొదళ్లగూడ, ఈదులపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సరఫరాలో జరిగే అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మొయినాబాద్ మండల పరిధిలో..

మొయినాబాద్: విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్లకొమ్మల తొలగింపు కారణంగా బుధవారం మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి, నక్కలపల్లి గ్రామాలతో పాటు ఎస్సీ కాలేజీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని మండల విద్యుత్ ఏఈ హమూనాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. కేతిరెడ్డిపల్లి ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు, నక్కలపల్లి ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకు, బ్రౌన్‌టౌన్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. ఆయా గ్రామాల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో ఎల్లమ్మ కల్యాణం



అమ్మవారి కల్యాణం నిర్వహిస్తున్న భక్తులు

నందిగామ: మండల పరిధిలోని వెంకమ్మగూడలో ఎల్లమ్మ కల్యాణం మంగళవారం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా కల్యాణోత్సవానికి ఆలయం ఎదుట నిర్వాహకులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. ఒగ్గు కళాకారుల ఆటాపాటల మధ్య అమ్మవారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేగూరు పీఏసీఎస్ చైర్మన్ అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మహబూబ్‌నగర్ జిల్లా ఎమ్మెల్సీ అభ్యర్థి నాగర్‌కుంట నవీన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, తాజా మాజీ సర్పంచ్ రజనీత వీరేందర్‌గౌడ్, నాయకులు గుండాల వేణు, గుండాల మల్లేశ్, శ్రీనివాస్, సాములయ్య, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

అంతిరెడ్డిగూడలో..

అంతిరెడ్డిగూడ శివారులోని ఈదుల్ల ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారి కల్యాణాన్ని గౌడసంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నర్సింహాయాదవ్, ఎంపీటీసీలు కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, దేపల్లి కుమార్‌గౌడ్, రాంరెడ్డి, బాల్‌రెడ్డి, తుమ్మల నర్సింహా యాదవ్, అంజియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పద్మనాభస్వామి బ్రహ్మోత్సవాలు



పూజలు నిర్వహిస్తున్న ఆలయ చైర్మన్ అనీతారెడ్డి, భక్తులు

కొత్తూరు: మండల పరిధిలోని పెంజర్ల గ్రామంలో ఉన్న ప్రఖ్యాతిగాంచిన అనంత పద్మనాభస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. ఆలయ కమిటీ చైర్మన్ బెజవాడ అనీతారెడ్డి మంగళవారం వేడుకలను ఘనంగా ప్రారంభించారు. ఇందులో భాగంగా ఆమె ఆలయంలో ప్రత్యేక పూజ లు నిర్వహించారు. అనంతరం చైర్మన్‌తో పాటు మాజీ జెడ్పీటీసీ మామిడి శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఆలయంలో మూడురోజుల పాటు నిర్వ హించే వేడుకలకు స్థానికులే కాకుండా ఇతర రాష్ట్రా లు, విదేశాల నుంచి సైతం భక్తులు హాజరవుతారని పేర్కొన్నారు. కోరిన కోరికలు తీరుతాయనే నమ్మకంతో ఆలయం భక్తుల దర్శనాలు, పూజలతో ప్రతిరో జు దేదీప్యమానంగా వెలుగొందుతుందన్నారు. వేడుకల్లో భాగంగా ఈ నెల 23న స్వామివారి కల్యాణం, రథోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని వసతులు, సౌకర్యాలు కల్పించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



తాళిబొట్టు చూపుతున్న భక్తుడు

కేశంపేట: మండల పరిధిలోని ఎక్లాస్‌ఖాన్‌పేట గ్రామంలో ఉన్న వేంకటేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా ఉన్న వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని ఎంపీపీ రవీందర్‌యాదవ్, కవిత, మురళీయాదవ్ హిమబిందూ దంపతులు పండితుల వేదమంత్రోచ్చారణలతో భక్తుల మధ్య కనుల పండువగా జరిపించారు. పొడగుట్టతండాకు చెందిన శంకర్‌నాయక్ భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ ఉత్సవంలో బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నవీన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు మురళీధర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ పల్లె నర్సింగ్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ వర్కాల లక్ష్మీనారాయణ, అంజిరెడ్డి, జమాల్‌ఖాన్, వేణుగోపాలచారి, పర్వాత్‌రెడ్డి, వెంకన్న యాదవ్, పల్లాటి లక్ష్మీనారాయణ, వెంకట్ నారాయణరెడ్డి, అంజిరెడ్డి, సురేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువులతో భూసారం పెంపు



సమావేశంలో మేనేజర్ రత్నాకర్

షాబాద్: జీవులు, జనుము, పెసర, అలసంద మొదలగు పచ్చిరొట్టపైర్లు పెంచి పూత దశలో భూమిలో కలియదున్నడం ద్వారా సేంద్రియ కర్బనం పెరిగి నేల సారవంతమవుతుందని సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్ అన్నారు. రేగడి దోస్వాద గ్రామంలో సుగుణమాల రైతు ఉత్పత్తిదారుల సంఘంలోని రైతులకు రాబోయే వానాకాలంలో పంటసాగు విధానాలపై రత్నాకర్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జీవన ఎరువులు వేయడం ద్వారా నేలలో లవణ రూపంలో కరిగి మొక్కకు అందుబాటులోకి వస్తాయన్నారు. తద్వారా రసాయన ఎరువులపై పెట్టే పెట్టుబడి కొంతవరకు తగ్గించుకోవచ్చన్నారు. ముఖ్యంగా విత్తనాల కొనుగోలు విషయంలో సరైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. రాబోయే కాలంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో కూరగాయల సాగు, నూనెగింజల సాగు, పండించిన పంట మార్కెటింగ్, సాంకేతిక పరిజ్ఞానం, పశువుల పెంపకం, మహిళకు ఉపాధి శిక్షణ, వంటి కార్యక్రమాలను భారతీయ వరి పరిశోధన స్థానం, భారతీయ నూనె గింజల పరిశోధన స్థానం, క్రీడా కృషి విజ్ఞాన కేంద్రం, వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖ సహకారంతో చేయబోతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దోస్వాద తిరుమలాపూర్, ముద్దెంగూడ, బొబ్బిలిగామ రైతులు అర్ద మల్లారెడ్డి, పిసరీ మాధవరెడ్డి, అంజయ్య, మల్లారెడ్డి, లింగం, వెంకటయ్య, గోపాల్‌రెడ్డి, శంకర్, మహేందర్‌రెడ్డి, యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ వాణిరెడ్డి

పహాడీషరీఫ్: వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని జల్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్ ఎ.వాణిరెడ్డి సిబ్బందికి సూచించారు. మున్సిపాలిటీ కార్యాలయంలో ఈ మేరకు మంగళవారం ఆమె సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మున్సిపాలిటీలోని పురాతన ఇళ్లలో ప్రజలు నివాసం ఉండకుండా చూడాలన్నారు. అలాంటి భవనాలను గుర్తించి నోటీసులు జారీ చేయాలని సూచించారు. ముఖ్యంగా రోడ్లపై నీరు నిల్వకుండా సిబ్బంది తగిన చర్యలు తీసుకోవాలన్నారు. డ్రైనేజీ పైప్‌లైన్లు బ్లాక్ అయితే వెంటనే నీరు వెళ్లేలా వ్యర్థాలను తొలగించాలన్నారు. అత్యవసర సమయంలో ప్రజలు టోల్ ఫ్రీ నంబర్ (7330 877 393)కు కాల్ చేయాలని ఆమె సూచించారు. సమావేశంలో మేనేజర్ యెన్నం సుదర్శన్, డీఈ వెంకన్న, పారిశుద్ధ్య విభాగం అధికారులు, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

భక్తుల ఇలవేల్పు సూర్యగిరి ఎల్లమ్మ



భక్తులకు దర్శనం ఇస్తున్న అమ్మవారు

తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ తల్లి భక్తులకు ఇలవేల్పుగా మారింది. మంగళవారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో ఉదయం నుంచే భక్తులు దర్శకోసం క్యూలైన్‌లో వేచి ఉన్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలతో పాటు బోనం, నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సామూహిక సత్యానారాయణస్వామి వత్రాలు చేశారు. అనంతరం భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రత్నం, భక్తులు పాల్గొన్నారు.